# ఘనంగా రంజాన్

**• ఈద్గాల వద్ద ముస్లింల సామూహిక ప్రార్థనలు • శుభాకాంక్షలు తెలిపిన పార్టీల నేతలు**



తాండూరు: రంజాన్ వేడుకల్లో ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి తదితరులు



పరిగి: ముస్లింలకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

తాండూరు, ఏప్రిల్ 11: రంజాన్ సందర్భంగా గురువారం తాండూరు నియోజకవర్గంలోని తాండూరు, యాలాల, బషీరాబాద్, పెద్దేముల్ మండలాల్లోని మసీదులు, ఈద్గాల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. 'ఈద్ ఉల్ ఫితర్'ను పురస్కరించుకొని తాండూరు పట్టణం చెన్‌గేశ్‌పూర్ మార్గంలోని ఈద్గా వద్ద ముస్లింలు పెద్ద సంఖ్యలో ప్రార్థనలు నిర్వహించారు. హైదారాబాద్ రోడ్డు ఖాంజాపూర్ గేటు సమీపంలో నమాజ్ చేశారు. ముస్లిం మత పెద్దలు (ఖాజీలు) ఖురాన్ బోధనలను చదివి వినిపించారు. ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి, రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్ పటేల్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజుగౌడ్‌తో పాటు పట్టణ పుర ప్రముఖులు, రాజకీయ పార్టీల నేతలు పాల్గొని ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ రంజాన్ పండుగ సామరస్యానికి, కరుణకు, దాతృత్వానికి ప్రతీక అన్నారు. అనంతరం రంజాన్ స్పెషల్ సురుకుంబా తాగారు.

**వికారాబాద్ :** వికారాబాద్ నియోజకవర్గంలోని మోమిన్‌పేట, బంట్వారం, కోట్‌పల్లి, వికారాబాద్ మండల పరిధితో పాటు మున్సిపల్ పరిధిలో ముస్లింలు ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వికారాబాద్ దర్గా వద్ద జడ్పీ వైస్ చైర్మన్ బైండ్ల విజయ్‌కుమార్ పాల్గొని ముస్లింలకు ఈద్ ముబారక్ తెలిపారు. కౌన్సిలర్లు సుధాకర్‌రెడ్డి, కిరణ్‌పటేల్ తదితరులు పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

**బొంరాస్‌పేట:** బొంరాస్‌పేట, దుద్యాల మండలాల్లో ముస్లింలు రంజాన్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. నెల రోజులపాటు ఉపవాస దీక్షలు చేపట్టిన ముస్లింలు గురువారం కొత్త బట్టలు ధరించి ఉదయం ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మత పెద్దలు పండుగ ప్రాముఖ్యతలను వివరించారు. అనంతరం బంధువులు, మిత్రులు, సన్నిహితులను ఆప్యాయంగా ఆలింగనం చేసుకుని పండుగ శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ పండుగ ప్రత్యేక వంటకం షీర్ ఖుర్మాను తాగారు. బొంరాస్‌పేట, దుద్యాల, చౌదర్‌పల్లి, గౌరారం, తుంకిమెట్ల తదితర గ్రామాల్లోని ఈద్గాల వద్ద సందడి వాతావరణం నెలకొంది. రంజాన్ సందర్భంగా మసీదులను విద్యుత్ దీపాలతో అలంకరించారు.



పరిగి: ముస్లింలకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి



వికారాబాద్: ఆలంపల్లి దర్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

**పరిగి:** పరిగి పట్టణంతోపాటు మండలంలోని గ్రామాల్లో రంజాన్ పండుగను ఘనం గా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలోని ఈద్గాల వద్ద ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పరిగి పట్టణంలోని ఈద్గా వద్ద ముస్లింలు రంజాన్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ముస్లింలకు పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్, మాజీ సర్పంచ్ సిద్దాంతి పార్థసారథి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు ఎస్పీ బాబయ్య, పి.చంద్రయ్య, ఎ.సురేందర్, కె .భాస్కర్ గుప్తా, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఆర్.ఆంజనేయులు, సీనియర్ నాయకులు బి.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ ఎస్.భాస్కర్, నాయకులు లాల్ కృష్ణప్రసాద్, ఎ.కృష్ణ, పాలాది శ్రీనివాస్, చిన్న నర్సింహులు, రవికుమార్ రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

**దోమ:** రంజాన్ మాసం ముస్లింలకు పవిత్రమైన పండుగ అని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, సర్పంచ్‌ల సంఘం దోమ మండల మాజీ అధ్యక్షుడు రాజిరెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని మసీద్‌లో వారు ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ దోమ మండల అధ్యక్షుడు గోపాల్‌గౌడ్, మాజీ జడ్పీటీసీ లక్ష్మయ్యముదిరాజ్, మాజీ ఎంపీపీ రాజగోపాల చారి, కోఆప్షన్ సభ్యులు ఖాజాపాష, డప్పు రమేశ్, బిచ్చయ్య, ఆయా పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



పెద్దేముల్ మండల కేంద్రంలో...



పరిగిలోని ఈద్గా వద్ద ముస్లింల ప్రత్యేక ప్రార్థనలు



పరిగి: పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

# పేదల ఆశాజ్యోతి పూలే

**• ఘనంగా జయంతి • నివాళులర్పించిన పార్టీలు, ప్రజాసంఘాల నేతలు**

పరిగి, ఏప్రిల్ 11: మహాత్మా జ్యోతిబాపూలే జయంతి వేడుకలను గురువారం పరిగిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పరిగిలోని జ్యోతి బాపూలే, సావిత్రీబాయిపూలే విగ్రహాలకు పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. వివిధ ప్రజా సంఘాలు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు సైతం మహాత్మా జ్యోతిబాపూలేకు ఘనంగా నివాళులర్పించారు. పూలే ఆశయాల సాధనకు ప్రతిఒక్కరు కృషి చేయాలని వారు పేర్కొన్నారు. మహాత్మా జ్యోతి బాపూలేకు నివాళులర్పించిన వారిలో వివిధ పార్టీల నాయకులు సిద్దాంతి పార్థసారథి, ఎస్పీ బాబయ్య, సురేందర్, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

**తాండూరు :** మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను గురువారం తాండూరు నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్‌పటేల్‌తో పాటు రాజకీయపార్టీల నేతలు, కుల సంఘాల ప్రతినిధులు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శుభప్రద్ పటేల్ మాట్లాడుతూ పూలే తన భార్య సావిత్రీబాయితో కలిసి స్త్రీ విద్యకు, హక్కులకోసం పోరాటం చేశారని పేర్కొన్నారు. 1873లో సత్యశోధక సమాజాన్ని స్థాపిం చి మానవ హక్కుల కోసం, అణగారిన వర్గాల సాంఘిక న్యాయం కోసం దానిని అంకితం చేశారని తెలిపారు. నేటి తరం పూలేను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.

**బొంరాస్‌పేట:** పూలే బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అని, సమాజంలో కుల నిర్మూ లన కోసం, అణచివేతకు గురైన బలహీన వర్గాల ప్రజలకు ఆత్మస్థైర్యం కల్పించి వారి హక్కుల కోసం నిరంతరం కృషి చేసిన గొప్ప సంఘ సంస్కర్త అని మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. పూలే 198వ జయంతి సందర్భంగా గురువారం మండలంలోని తుంకిమెట్లలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల వివక్ష నిర్మూలనకు, బాలికా విద్యకు ఆయన ఎంతో కృషి చేశారని కొనియాడారు. విద్యతోనే సామాజిక అభివృద్ధి సాధ్యమని ఆయన చూపిన బాటలోనే అందరూ నడవాలని, పూలే ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కోట్ల యాదగిరి, మాజీ వైస్ ఎంపీపీ నారాయణరెడ్డి, ఎంపీటీసీ తిరుపతయ్య, పార్టీ నాయకులు సోంనాథ్, నెహ్రూ నాయక్, రాజేందర్‌సింగ్, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



బొంరాస్‌పేట: తుంకిమెట్లలో పూలేకు నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి, పార్టీ నాయకులు.



తాండూరు: పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్ పటేల్



కొడంగల్‌లో ప్రజాసంఘాల నాయకులు, విద్యార్థులు ..



వికారాబాద్: పూలే జయంతి వేడుకల్లో పాల్గొన్న ధర్మ సమాజ్ పార్టీ నాయకులు

**కొడంగల్:** మహాత్మా జ్యోతిరావు పూలే జయంతిని పురస్కరించుకుని గురువారం స్థానిక వీబీఆర్ కంప్యూటర్ ట్రైనింగ్ సెంటర్‌లో విద్యార్థులతో పాటు ప్రజా సంఘాల నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటయ్య, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు రమేశ్‌బాబు, లంబాడ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు సూర్యనాయక్, ఆర్‌ఎస్‌యూ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు చంద్రశేఖర్, డివిజన్ అధ్యక్షుడు సాయిలు, బీసీ సంఘం తాలుకా అధ్యక్షుడు భీమరాజు, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు

**దోమ :** పూలే జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని అంబేద్కర్ కాలనీ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటయ్య అన్నారు. గురువారం మండల పరిదిలోని దిర్సంపల్లిలో పూలే జయంతిని పురస్కరించుకుని యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పూలే దంపతుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పూలేను ఆదర్శంగా తీసుకొని సమాజ ఉద్ధరణకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో యూత్ అసోషియేషన్ సభ్యులు బాలకృష్ణ, అంజి, కిష్టయ్య, కుమార్, హన్మంతు, కృష్ణ పాల్గొన్నారు.

**వికారాబాద్ :** పీడిత ప్రజల విముక్తి ప్రధాత మహాత్మా జ్యోతిరావు పూలే అని, ఆయన జయంతి రోజును ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించాలని ధర్మ సమాజ్ పార్టీ వికారాబాద్ జిల్లా కన్వీనర్ రవీందర్ మహారాజ్ అన్నారు. గురువారం వికారాబాద్ జిల్లా కేంద్రంలో ఆధ్వర్యంలో పూలే జయంతి కార్యక్రమాన్ని ధర్మ సమాజ్ పార్టీ వికారాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వికారాబాద్ జిల్లా కేంద్రంలో జ్యోతిరావు పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ధర్మ సమాజ్ పార్టీ జిల్లా కోకన్వీనర్లు నరేశ్, యాదగిరి, వెంకటేశ్, మల్లికార్జున్, శ్రీనివాస్ వివిధ మండల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

**కులకచర్ల:** మండల పరిధిలోని పలు గ్రామాల్లో జ్యోతిరావు పూలే జయంతిని వివిధ సంఘాల ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ముజాహిద్‌పూర్‌లో యువకులు, గ్రామస్తులు జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, నాయకులు తుక్యానాయక్, బాలకృష్ణ, చంద్రయ్య, భాస్కర్, అంబాజీరావు, నర్సింహులు, రాజు, కృష్ణ, యాదయ్య, ఆనందం, సతీశ్, శ్రీనివాస్, శివ, నరేశ్, మాణిక్‌రావు, గ్రామస్తులు పాల్గొన్నారు. చౌడాపూర్ మండల కేంద్రంలో మహాత్మాజ్యోతిరావు పూలే జయంతిని పురస్కరించుకొని గురువారం యువజన సంఘాల ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి పలువురు నివాళులర్పించారు. కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం మాజీ అధ్యక్షుడు వెంకటేశ్, అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు అశోక్, గోపాల్, రాఘవేందర్, కృష్ణయ్య, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న సంగీత కచేరి..



డక్కలి పోచయ్యను సన్మానించిన బాలమార్తండ మహారాజ్ , కార్యక్రమానికి హాజరైన భక్తులు, చిన్నారులు

నవాబుపేట, ఏప్రిల్ 11: ఉగాదిని పురస్కరించుకొని శ్రీరామనవమి వరకు నిర్వహించే వసంత రుతువు కార్యక్రమంలో భాగంగా మాణిక్ ప్రభువు ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సంగీత కచేరి ఆకట్టుకుంది. గురువారం మండల కేంద్రంలోని మాణిక్ ప్రభువు ఆలయ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో నారాయణపేట జిల్లాలోని మక్తల్ మండలానికి చెందిన కిన్నెర తంత్రీ వాద్య కళాకారుడు డక్కలి పోచయ్య అంతరించిపోతున్న సజీవ కళను ప్రదర్శించారు. ఈ సందర్భంగా పండుగ సాయన్న జీవిత చరిత్రను భక్తులకు వివరించారు. జానపద, సంగీత కళలు అంతరించి పోవడానికి కారణాలను తెలియజేశారు. అనంతరం పోచయ్యను సన్మానించారు. కార్యక్రమంలో కళాకారులు భాగేశ్, విగ్నేశ్ కామత్, వరద్ సోహనీ కార్య నిర్వాహకులు ఆరవింద చార్యులు, రఘు పంతులు, రవీందర్‌రెడ్డి, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

## కాగ్నానదిని పరిశీలించిన అదనపు కలెక్టర్



తాండూరు, ఏప్రిల్ 11 : తాండూరు కాగ్నానదిని గురువారం అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ పరిశీలించారు. వేసవి కాలంలో ప్రజలకు మంచి నీటి ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత శాఖ అధికారులు సరైన చర్యలు తీసుకోవాలని సూచించారు. మిషన్ భగీరథ నీళ్లు రాని సమయంలో తాండూరు కాగ్నానది నీళ్లను ప్రజలకు అందించే ఏర్పాట్లు చేయాలని సూచించారు. కాగ్నానదిలో పూడికతీత పనులతోపాటు చెత్తాచెదారం లేకుండా చేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు మంచి నీటి ఇబ్బందులకు గురికాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఆయన తెలిపారు.

## అలరించిన బండలాగుడు పోటీలు



కొడంగల్, ఏప్రిల్ 11: కొడంగల్‌లోని వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం నిర్వహించిన రథోత్సవం కనుల పండువలా సాగింది. బంగారు వర్ణ రథంపై శ్రీదేవి, భూదేవి సమేతుడైన శ్రీనివాసుడిని కొలువుదీర్చి ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాల్లో భాగంగా ఎద్దులతో బండలాగుడు పోటీలను నిర్వహించారు. విజేతలకు మొదటి బహుమతిగా 25 తులాల వెండి కడియాలని ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, ద్వితీయ బహుమతిగా 15తులాల వెండి కడియాలను డాక్టర్ రవీంద్రయాదవ్, తృతీయ బహుమతిగా 10తులాల వెండి కడియాలను కౌన్సిలర్ శంకర్‌నాయక్ సమకూర్చారు. మొదటి బహుమతిని దండ్ల వెంకటయ్య, ద్వితీయ బహుమతి కుర్మయ్య, తృతీయ బహుమతి మద్దూర్ వెంకటయ్య గెలుపొందారు.

## హజ్ యాత్రికుడికి సన్మానం



పెద్దేముల్, ఏప్రిల్ 11 : హజ్ యాత్ర పూర్తి చేసుకొని వచ్చిన గాజీపూర్‌కు చెందిన మైనారిటీ సీనియర్ నాయకుడు గాజుల గౌస్‌ను గురువారం గ్రామంలోని యువ నాయకులు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో యువ నాయకులు మహిపాల్‌రెడ్డి, సంగారెడ్డి, ఆహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## ముదిరాజ్ నాయకుల ప్రతిజ్ఞ



వికారాబాద్, ఏప్రిల్ 11 : తెలంగాణ ముదిరాజ్ మహాసభ అధ్యక్షుడు, చేవెళ్ల పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌ను చేవెళ్ల ఎంపీగా గెలిపిస్తామని వికారాబాద్ జిల్లా తొర్మామిడి గ్రామంలో స్థానిక ముదిరాజ్ సంఘం నాయకులు గురువారం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు టి.వీరప్ప ముదిరాజ్, బసయ్య ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## మద్యం తరలిస్తున్న ఇద్దరిపై కేసు



వికారాబాద్, ఏప్రిల్ 11 : మద్యాన్ని అక్రమంగా తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేశారు. ఇందుకు సంబంధించి గురువారం ఎక్సైజ్ సీఐ రాఘవీణ తెలిపిన వివరాలు.. వికారాబాద్ నుంచి మన్నెగూడ రహదారిపై ఎక్సైజ్ పోలీసులు బుధవారం అకస్మికంగా వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా ఒక ద్విచక్ర వాహనం, స్కార్పి యో వాహనంలో మద్యాన్ని అక్రమంగా తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులు పట్టుకున్నారు. ఇరువురిపై కేసు నమోదు చేసి, రెండు వాహనాలను, మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ తనిఖీల్లో డీటీఎఫ్ సీఐ శ్రీనివాస్, ఎక్సైజ్ ఎస్సైలు వీరాంజనేయులు, వాణి ఉన్నారు.

## బీజేపీ బూత్‌కమిటీ ఎన్నిక



కులకచర్ల, ఏప్రిల్ 11 : కులకచర్ల మండల పరిధిలోని చెల్లాపూర్ గ్రామంలో బీజేపీ పార్టీ మండల అధ్యక్షుడు సూర్యకాంతం ఆధ్వర్యంలో బూత్‌కమిటీలను ఎన్నుకున్నారు. గ్రామంలో 124,125 బూత్ అధ్యక్షులను ఎన్నుకున్నారు. 124బూత్ అధ్యక్షునిగా పి ఆంజనేయులు, 125 బూత్ అధ్యక్షుడిగా కే గోపాల్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు హన్మంతు, గుడాల వెంకటేశ్, బోయిని భీమయ్య, కొండ అంజి, సత్తయ్య, ఆంజనేయులు, బాబు, రామకృష్ణ, రామాంజనేయులు, అంజయ్య, కృష్ణయ్య, వెంకటయ్య, వెంకట్‌రాములు, గ్రామ యువకులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
FINANCIAL SERVICES
★రుణాలు, వ్యక్తిగత, వ్యవసాయ, వ్యాపార రుణం, అతి తక్కువ వడ్డీ రేటుతో, సిబిల్ అవసరం లేదు! NPA కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఏజెంట్స్ కావలెను. నొవా ఫైనాన్స్. ఫోన్: 7696660523.
NT-311979_All
గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
Telangana Today
FOR LOCAL TO GLOBAL NEWS
పుట్టినరోజు, పదవీ విరమణ, వార్షికోత్సవ శుభాకాంక్షలు, వర్ధంతి, జయంతి, లీగల్ నోటీసులు మరియు ఇతర ప్రకటనల కొరకు
ఈ దిగువ తెలిపిన నెంబర్లపై సంప్రదించగలరు.
ప్రకటనల విభాగం సెల్: 80966 77655
వికారాబాద్/పరిగి/ శంకర్‌పల్లి
తాండూర్/కొడంగల్ } 80966 77668
ఇబ్రహీంపట్నం/మహేశ్వరం : 80966 77962